క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



మంత్రి అప్పలరాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న విజయ్‌కుమార్

కోవూరు : రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజును ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ నెల్లూరు మినర్వా గ్రాండ్ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు చర్చించారు. ఆయన వెంట పశుసంవర్ధక శాఖ జేడీ మహేశ్వరుడు, డీఎల్‌డీఏ ఈఓ సోమయ్య, మురళీకృష్ణ, కృష్ణారెడ్డి ఉన్నారు.

ఆర్బీకేలతో ఎంతో ఉపయోగం

నెల్లూరు(సెంట్రల్): గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. చైర్మన్ పెంచలరెడ్డి, నాగమోహన్, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విధి నిర్వహణలో అలసత్వం వహించే విద్యుత్ అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు హెచ్చరించారు. జిల్లా సర్కిల్ పరిధిలోని గూడూరు, నాయుడుపేట డివిజన్ల విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశాలను ఆయా ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఆయన మాట్లాడారు. రైతులకు పగటి పూట తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న 30 రోజుల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేయాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. అధికారులు, సిబ్బంది వారికి నిర్దేశించిన హెడ్ క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలని చెప్పారు. ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు గురవయ్య, ధర్మజ్ఞాని, జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఇస్మాయిల్, శ్రీధర్, రాఘువేంద్రం, బెనర్జీ, మధు, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టేందుకు చర్యలు

నెల్లూరు(బారకాసు): మాతాశిశు మరణాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని డీఎంహెచ్ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ఇటీవల సంభవించిన మాతాశిశు మరణాలపై సబ్ కమిటీతో సమీక్ష సమావేశాన్ని సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల తన చాంబర్‌లో డీఎంహెచ్ఓ శుక్రవారం నిర్వహించారు. రెండు మాతృ, 11 శిశు మరణాలపై సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. వైద్యులతో సకాలంలో పరీక్షలు, సరైన ప్రసవ ప్రణాళిక ద్వారా మాతాశిశు మరణాలను గణనీయంగా తగ్గించొచ్చని చెప్పారు. డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఇన్‌చార్జి డీఎల్ఏటీఓ బ్రిజిత, డాక్టర్ దయాకర్, డీఐఓ శైలీనాకుమారి, గైనకాలజిస్ట్ ఇందిర, డాక్టర్లు రామచంద్ర, కవిత, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

భార్య కళ్లెదుటే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని..

- ఇంటికి రాకపోవడంతో భర్త ఘాతుకం

నెల్లూరు(క్రైమ్): ఇంటికి భార్య రాలేదనే మనస్తాపంతో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న భర్త తీవ్రంగా గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు ఆర్జీజే కాలనీకి చెందిన మోషే శెట్టిగుంటరోడ్డుకు చెందిన పద్మను ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. రెండేళ్లుగా దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. అనుమానం వారి కాపురంలో చిచ్చురేపింది. దీంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం దంపతుల నడుమ గొడవ తారస్థాయికి చేరుకుంది. దీంతో భర్తపై అలిగి డైకస్‌రోడ్డులోని తాతయ్యబడి సమీపంలో ఉంటున్న తన అక్క అమ్ములు వద్దకు వెళ్లి అక్కడే ఉంటున్నారు. రోజూ మోషే అక్కడికి వెళ్లి భార్యను ఇంటికి రావాలని బతిమిలాడినా ఆమె నిరాకరించారు. ఈ క్రమంలో గురువారం మరోసారి వెళ్లి భార్యను ఇంటికి రావాలని కోరారు.

నిరాకరించడంతో మనస్తాపానికి గురై తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆమె కళ్లెదుటే నిప్పంటించుకున్నారు. ఊహించని పరిణామంతో భార్య పెద్దగా కేకలేశారు. పద్మ, ఆమె అక్కాబావ మంటలను ఆర్పి మోషేను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు హుటాహుటిన తరలించారు. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



కొమరికలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొమరిక, వారణాశికండ్రిగ గ్రామాల్లో రెండో రోజు శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లిన ప్రసన్నకుమార్‌రెడ్డి.. ప్రభుత్వం ద్వారా వారికి అందిన సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. బుక్‌లెట్‌ను అందజేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన దృష్టికి వచ్చిన పలు సమస్యలను అధికారులకు తెలియజేసి అక్కడికక్కడే పరిష్కరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబం సంక్షేమ పథకాల ద్వారా లక్షలాది రూపాయలు లబ్ధిపొంది ఉందన్నారు. ఏ గడపకు వెళ్లినా ప్రజలు చిరునవ్వుతో స్వాగతం పలుకుతున్నారని తెలియజేశారు. ప్రధానంగా పింఛన్లు అందుకొంటున్న వృద్ధులు, వితంతువులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన పక్క రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడం, సమస్యలను పరిష్కరించడం కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలియజేశారు. దీనిని అధికారులు ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని, తద్వారా ప్రభుత్వ ప్రతిష్ట పెంచాలని సూచించారు. అనంతరం కొమరికలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉడతా వెంకటశేషయ్య, బండ్ల జనార్దన్, చేవూరు మల్లికార్జున, నాగేశ్వరావు, వీఆర్వో మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి సింధూర తదితరులు పాల్గొన్నారు.

యార్డులో సబ్సిడీ టమాటాల పంపిణీ



టమాటాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ రత్నమ్మ

పొదలకూరు : పట్టణంలోని నిమ్మమార్కెట్ యార్డులో సబ్సిడీపై కిలో టమాటాలను రూ.50కే పంపిణీ చేసే కార్యక్రమాన్ని సర్వేపల్లి ఏఎంసీ చైర్మన్ పెదమల్లు రత్నమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టమాటాలకు దేశ వ్యాప్తంగా డిమాండ్ ఏర్పడిందని, ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో పొదలకూరు ప్రాంత వాసులకు సబ్సిడీ టమాటాలను పంపినట్లు తెలిపారు. బయటి ప్రాంతాల్లో కిలో టామాటాలను రూ.120కు కొనుగోలు చేసి ఒక్కో కుటుంబానికి కిలో రూ.50 వంతున అందజేస్తున్నట్లు చెప్పారు. రెండు టన్నుల టామాటాలను దిగుమతి చేసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పెదమల్లు రమణారెడ్డి, మార్కెట్ కమిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ వివరాలను సిద్ధం చేసుకోవాలి

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



వలంటీర్లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు: ఈనెల 22న పాతవంగల్లులో స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తారని, కావున సంక్షేమ పథకాల సమగ్ర వివరాలను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని పాతవంగల్లు పంచాయతీ కార్యాలయంలో వలంటీర్‌లతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష సర్వేను అత్యంత పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎవరికీ ఏ సర్టిఫికెట్‌లు అవసరమో స్పష్టంగా తెలుసుకుని నమోదు చేయాలన్నారు. సర్టిఫికెట్‌లు లేని కారణంగా సంక్షేమ పథకాలు అందని వారంటూ ఉండకూడదని సూచించారు. అర్హులైన వారందరికీ సంక్షేమం అందాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినందున ప్రతిఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో సర్పంచ్ బి.లక్ష్మిబాయి, ఎంపీటీసీ నంబూరి ప్రసాద్, ఉపసర్పంచ్ మధు, పంచాయతీ కార్యదర్శి షబ్బీర్, వెల్ఫేర్ సహాయకులు పూర్ణ, నాయకులు చెన్నారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సీహెచ్.శ్రీనివాసులురెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థినుల ఎంపిక



రిహాన్



ఝాన్సీ



పూజిత

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సుజాత శుక్రవారం తెలిపారు. తమ పాఠశాలలో గత పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన రిహాన్ (583), ఝాన్సీ (573), పూజిత (563) ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఆమె అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

- ఎమ్మెల్యే ప్రసన్న పరామర్శ



గాయలపాలైన వలంటీర్

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామానికి చెందిన ముగ్గురు వలంటీర్లు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. స్థానికుల కథనం మేరకు.. కొమరిక గ్రామంలో జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'లో వీరు పాల్గొని, వారణాశికండ్రిగ గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. మార్గ మధ్యలో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి గాయపడ్డారు. ఈ ఘటనలో మునగాశెట్టి నరేంద్ర, పాముల రవికిరణ్ తీవ్రగాయాల పాలవగా, చలమల సుధీర్ అనే యువకుడికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని వైద్యశాలలో క్షతగాత్రులను పరామర్శించారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏటూరు వెంకటమోహన్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి చెందిన వెంకటమోహన్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో కొరియర్‌బాయ్‌గా పనిచేస్తూ అవ్వాతాతల వద్ద ఉంటున్నాడు. ఈనెల 12వ తేదీన పూటుగా మద్యం సేవించి తనకు ఫ్రైడ్‌రైస్ కావాలని తన అవ్వను అడగ్గా ఆమె డబ్బులు లేవని చెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకటమోహన్ తన గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. వెంటనే గమనించిన అవ్వ పెద్దగా కేకలు వేయడంతో మేనమామ నాగరాజు పరుగున వెళ్లి కొనఊపిరితో ఉన్న వెంకటమోహన్‌ను స్థానికంగా ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

కోవూరు : 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, దీనిపై అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జెడ్పీ సీఈఓ, కోవూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి భూపతి చిరంజీవి అన్నారు. మండల కేంద్రమైన కోవూరులో బీఎల్‌ఓలతో ఆయన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి ఓటరు నమోదు ప్రక్రియకు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి యువతను గుర్తించి ఓటు నమోదు చేయించాలని సూచించారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా ఈ ప్రక్రియను చేపట్టాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ పద్మజ, బీఎల్వోలు తదితరులు ఉన్నారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం ముత్తుకూరుకు వస్తారని ఎంపీడీఓ ప్రత్యూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ముత్తుకూరు–1 సచివాలయంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని, మండలంలోని ప్రజాప్రతినిధులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వెంకటాచలంలో..

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం వెంకటాచలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు నూతనంగా నిర్మించిన ఆర్బీకేను ప్రారంభిస్తారన్నారు. అనంతరం వెంకటాచలం, నిడిగుంటపాళెం గ్రామాల్లో జరుగనున్న జగనన్న సురక్ష శిబిరాల్లో పాల్గొంటారని తెలియజేశారు.

బీమా సాయం అందజేత

పొదలకూరు : పట్టణంలోని ఎమ్మార్వో కాలనీకి చెందిన జ్యోతి నరసమ్మకు శుక్రవారం ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి వైఎస్సార్ బీమా నగదు రూ.10 వేలను అందజేశారు. ఇటీవల నరసమ్మ కుమారుడు సుబ్రహ్మణ్యం మిద్దెపై పడుకుని ప్రమాదవశాత్తు కిందపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో తక్షణ సాయం కింద బీమా నగదును బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఎస్‌కే అల్లాభక్షు, సచివాలయ కన్వీనర్ బొల్లినేని భారతమ్మ, జి.వేణుగోపాల్‌రెడ్డి, వార్డుసభ్యులు గుంటి భాస్కర్, బి.హరిప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

కోటి కుంకుమార్చనకు ఆహ్వానం



ఎంపీ వేమిరెడ్డి దంపతులకు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ఆలయ చైర్మన్

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో ఈనెల 19వ తేదీ నుంచి జరిగే కోటి కుంకుమార్చన కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులను ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు శుక్రవారం ఆహ్వానించారు. ఈ మేరకు నెల్లూరులోని వారి నివాసంలో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.

చరిత్ర సృష్టించిన భారత్



విజయ చిహ్నం చూపుతున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం: చంద్రయాన్–3 ప్రయోగంతో భారతదేశం చరిత్ర సృష్టించిందని జిల్లా రిసోర్స్‌పర్సన్ గండికోట సుధీర్‌కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయన శుక్రవారం విజయ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్–3 ప్రయోగం ద్వారా భారతదేశం కీర్తి ప్రతిష్టలు పెంచుకుందన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

నెల్లూరు(పొగతోట): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీఓ సుస్మితారెడ్డి ఆదేశించారు. నగరంలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన వెబ్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మరుగుదొడ్ల నిర్వహణ, తడి, పొడి చెత్తను వేరుచేయడం, తదితరాలపై ఆగస్ట్ ఒకటి నుంచి 20 వరకు అవగాహన కల్పించాలన్నారు.

కరోనా కష్టకాలంలో అండగా..



వృద్ధులు, పిల్లలకు పండ్లు అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

ఈ ఫొటోలో వృద్ధులు, పిల్లలకు పండ్లు అందజేస్తున్న వలంటీర్ పేరు గుంటి శ్రీనివాసులు. పొదలకూరు సచివాలయం బిట్–1లో గ్రామ వలంటీరుగా పనిచేస్తున్నారు. కరోనా కష్టకాలంలో ఈయన విశేష సేవలను అందించారు. ఆకలితో అలమటిస్తున్న వృద్ధులు, పిల్లల వద్దకు ధైర్యంగా వెళ్లి దాతలు అందజేసిన పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. వారి మంచి చెడ్డలను పట్టించుకుని వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. ప్రతినిత్యం అధికారులతో మాట్లాడుతూ పేదలకు సాయపడ్డారు.

– పొదలకూరు

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

- నాడు–నేడు పనులను వేగవంతం చేయండి
- జేసీ కూర్మనాథ్



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

మనుబోలు : గృహ నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని మడమనూరు, వీరంపల్లి, అక్కంపేట సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరుతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఇళ్ల నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు దృష్టి సారించాలన్నారు. నిర్మాణ పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, ఆర్బీకేలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది తప్పకుండా యూనిఫాం ధరించాలన్నారు. జేవీకే కిట్లను విద్యార్థులందరికీ పంపిణీ చేశారా.. అని ఆరా తీశారు. ఇప్పటి వరకు 85 శాతం పంపిణీ చేశామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సమాధానమిచ్చారు. దీంతో జేసీ మిగిలిన వారు ఏమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ అందజేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శివకృష్ణయ్య, డీటీ శ్రీకాంత్‌రెడ్డి, ఈఓపీఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రేష్మసోని, సర్వేయర్‌లు శ్రీనివాసులు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

'నా గౌరవానికి భంగం కలగలేదు'

- సోమిరెడ్డికి దళితులు గుణపాఠం చెబుతారు
- మరుపూరు సర్పంచ్ నాగయ్య



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్ నాగయ్య (ఫైల్)

పొదలకూరు : 'దళిత సర్పంచ్‌నైన నా గౌరవానికి ఎక్కడా భంగం కలగలేదు. మా పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నేతలు నాకు తగిన గౌరవం ఇస్తున్నారు' చూసుకుంటున్నారు' మరుపూరు సర్పంచ్ నేలటూరు నాగయ్య అన్నారు. ఈనెల 8వ తేదీన వైఎస్సార్ జయంతి సందర్భంగా మరుపూరు ఆర్బీకేలో సర్పంచ్‌ను నిలబెట్టి అవమానించారని టీడీపీ నేతలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. నాగయ్య శుక్రవారం మాట్లాడుతూ తన చేతుల మీదుగానే రైతు దినోత్సవం జరిగిందని స్పష్టం చేశారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించింది తానేనని పేర్కొన్నారు. టీడీపీ నేత సోమిరెడ్డి చౌకబారు ప్రచారానికి పాల్పడుతున్నట్లు నాగయ్య మండిపడ్డారు. కార్యక్రమం చూసుకుని పనిపై వెళ్తూ నిల్చున్న తన ఫొటోను తీయించి సోషల్‌మీడియాలో నీతిమాలిన చర్యకు పూనుకున్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎక్కడ ఏమి జరిగినా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని బాధ్యుడిని చేసే ప్రయత్నంలో భాగంగా సోమిరెడ్డి విష ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. మరుపూరులో మంత్రి బంధువులు తనను గౌరవంగా చూసుకుంటూ ఏ కార్యక్రమం జరిగినా తన చేతుల మీదుగానే చేయిస్తున్నట్లు వెల్లడించారు. సోమిరెడ్డికి, ఆయన నాయకుడు చంద్రబాబుకు దళితులంటే చులకన అని, చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో దళితుల్లో పుట్టాలని ఎవరూ కోరుకోరని అహంకార పూరిత వ్యాఖ్యలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

పాఠశాలలకే బడిఈడు పిల్లలు



కొడవలూరు: పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ



కొడవలూరు: పాఠశాలలో చేర్పించిన పది మంది పిల్లలతో ఎంఈఓ

కొడవలూరు: బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఎంఈఓ జి.వసంతకుమారి ఆధ్వర్యంలోని బృందం మండలంలోని తలమంచిలో శుక్రవారం విస్తృతంగా పర్యటించింది. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో తిరిగి బడిబయట ఉండే ఎనిమిది మంది బాలికలు, ఇద్దరు బాలురను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ఆవశ్యకతను తెలియజేసి విద్య ద్వారా ఏ విధంగా అభివృద్ధి చెందవచ్చో చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. దీంతో వారు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు అంగీకరించారు. ఈ చిన్నారులను కొడవలూరులోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు, విద్య ఆవశ్యకత గురించి తెలియకుండా తల్లిదండ్రులే పిల్లలను పాఠశాలలకు పంపడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరిపై ప్రత్యేక దృష్టి సారించడంతో గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు చెప్పారు. ఎంఈఓ వెంట వెల్ఫేర్ సహాయకుడు పి.మనోజ్‌కుమార్, మహిళా పోలీసు జె.అనూరాధ, హెచ్ఎం జి.రవీంద్రబాబు, సీఆర్పీ శ్రీహరిబాబు ఉన్నారు.


పిల్లలందరూ బడిలోనే ఉండాలి



కోవూరు : రికార్డులు పరిశీలిస్తున్న ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త సుబ్రహ్మణ్యం

కోవూరు : బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా సీఆర్పీలు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని జేజేఆర్ ఉన్నత పాఠశాల, 10వ వార్డు ప్రాథమిక పాఠశాల, కొత్తూరులోని ఎంపీపీ పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం సమన్వయకర్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్య ఆవశ్యకత, ప్రభుత్వ పథకాలు, పాఠశాలల వసతులు, భవిష్యత్తు అవసరాలను తల్లిదండ్రులకు వివరించాలని, తద్వారా పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చూడాలని కోరారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయంలో బడిబయట పిల్లల సర్వే గురించి ఆరా తీశారు. వీరి వెంట సీఆర్పీలు శ్రీనివాసులు, హరీష్ తదితరులు ఉనారు.


కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన చరణ్

మనుబోలు : కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో ఓ బాలుడికి గాయాలైన ఘటన మనుబోలు మండల కేంద్రంలోని ఎరుకల కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. చంద్రమౌళినగర్ ఎరుకల కాలనీలో ఉంటున్న గడ్డం చరణ్ తన తల్లితో కలిసి మెయిన్ రోడ్డు నుంచి తిరిగి వస్తుండగా ఉన్నట్లుండి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. వెంటనే స్థానికులు కర్రలతో కుక్కలను తరిమేశారు. గాయపడిన చరణ్‌ను చికిత్స నిమిత్తం గూడూరులోని ఆస్పత్రికి తరలించారు.

రాజుపాళెంలో వైఎస్సార్ జలకళ బోర్లు



పొదలకూరు : మండలంలోని దుగ్గుంటరాజుపాళెం గ్రామంలో వైఎస్సార్ జలకళ పథకం కింద బోర్లు వేయిస్తున్నారు. గ్రామానికి మొత్తం 17 బోర్లు మంజూరు కాగా శుక్రవారం నుంచి వాటిని వేయడం చేపట్టారు. ఎక్కడ బోర్లు వేసినా పుష్కలంగా నీరు పడుతున్నట్లు రైతులు వెల్లడించారు. మండలానికి మొత్తం 240 బోర్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో మెట్టరైతుల పొలాల్లో యుద్ధప్రాతిపదికన బోర్లు వేయిస్తున్నారు.